## క్లుప్తంగా

### ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా జకియోద్దీన్, డీఈఓగా దేవేందర్, ప్రధానోపాధ్యాయుడిగా పవన్‌కల్యాణ్, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ఉపాధ్యాయులుగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు, ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్, రామస్వామి పాల్గొన్నారు.

### బాధ్యత పెరిగింది

● ఎంపీపీ కొప్పు సుకన్య



**యాచారం:** గ్రామాలు మీ చేతుల్లోనే ఉంటాయి. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపీపీ కొప్పు సుకన్య ప్రత్యేకాధికారులకు సూచించారు. ప్రజా పాలనపై దృష్టి పె ట్టాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామాల ప్రత్యేకాధికారులతో సమీ క్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే పలు పథకాలు, అత్యవసర పనులతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మళ్లీ గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా నియమించడం మరింత బాధ్యత పెరిగినట్లు అయిందని అన్నారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. అంతకు ముందు ప్రత్యేకాధికారులుగా నియమితులైన అధికారులు గ్రామ పంచాయతీల్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, పలు గ్రామాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

### 'గుత్తా'కు శుభాకాంక్షలు



సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్‌రాజు

**ఇబ్రహీంపట్నం:** శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కేవీ రమేష్‌రాజు శుక్రవారం ఆయన నివాసంలో కలిసి బొకేను అందజేసి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. సుఖేందర్‌రెడ్డి మరిన్ని పదవులు అలంకించాలని ఆకాంక్షించారు. ఎంపీగా మండలి స్పీకర్ ఆయన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు.

### పీఏసీఎస్ చైర్మన్‌గా యాదయ్య

**మంచాల:** మంచాల పీఏసీఎస్ తాత్కాలిక చైర్మన్‌గా బోద్రమోని యాదయ్యను నియమిస్తున్నట్లు డీసీఓ ధాత్రిదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఏసీయస్ చైర్మన్‌గా ఉ న్న పుల్లారెడ్డిని అనర్హుడిగా ప్రకటించిన విషయం తెలిసిందే. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకు న్న యాదయ్య మాట్లాడుతూ అధికారులు, పాలకవర్గసభ్యుల సహకారంతో మంచాల పీఏసీయస్ సేవలను రైతులకు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. రైతుల సంక్షేమానికే పెద్ద పీట వేస్తామని తెలిపారు.

### భువనగిరి నుంచి పోటీ చేస్తా



దరఖాస్తును అందజేస్తున్న మురళీధర్‌రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్:** భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా అవకాశమిస్తే పోటీ చేస్తానని పెద్ద అంబర్‌పేట మున్సిపల్ కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉన్నారు. దీంతోపాటు మంత్రి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి సోదరుల కుటుంబానికి సమీప బంధువైన మురళీధర్‌రెడ్డి ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరడం చర్చనీయాంశంగా మారింది.

# పల్లె ప్రజలకు అరకొర వైద్యం!

**ఉప కేంద్రాలకే పరిమితమైన సేవలు**

- పీహెచ్‌సీ ఏర్పాటుకు ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు



కద్తాల్ ఆరోగ్య ఉప కేంద్రం

పల్లె ప్రజలకు వైద్యం దూరమైంది. 40 వేలకు పైగా జనాభా ఉన్న కడ్తాల్ మండలంలో ఇప్పటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. ఆరోగ్య ఉప కేంద్రాలున్నా.. పగలు మాత్రమే వైద్య సేవలు అందుతున్నాయి. రాత్రి వేళల్లో ఎలాంటి ఆపద వచ్చినా తిప్పలు తప్పడం లేదు. మండలవ్యాప్తంగా అధికంగా గిరిజనులున్నారు. గిరిజనులు, ఇతరులు వైద్యం చేయించుకోవాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. పేదలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేల రూపాయలు వెచ్చించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

**కడ్తాల్:** మండల కేంద్రంలో నేటికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కలగానే మిగిలింది. చిన్నపాటి రోగాలకే ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. సుమారు 40 వేలకు పైగా జనాభా ఉన్న కడ్తాల్ మండలంలో ప్రభుత్వ వైద్యం ఆరోగ్య ఉప కేంద్రాలకే పరిమితమైంది. జనాభాకు అనుగుణంగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యం ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఆరోగ్య కేంద్రం ఇంతవరకు అందని ద్రాక్షగానే మిగిలింది. పేరుకే పెద్ద మండలంగా ఉన్న కడ్తాల్ మండల కేంద్రంలో ప్రజల ఆరోగ్యానికి భరోసా కరువైంది. హైదరాబాద్‌కు 40 కి.మీల దూరంలో ఉన్న కడ్తాల్ మండల కేంద్రం దినదినాభివృద్ధి చెందుతూ పట్టణాన్ని తలపిస్తోంది. ప్రైవేట్‌లో ఆర్‌ఎంపీలు, పీయంపీలు, డాక్టర్లు ఉన్నా.. వారు కూడా పగటిపూట వైద్యానికి పరిమితమవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదం జరిగినా.. ఇతర ఇబ్బందులు వచ్చినా.. చికిత్స కోసం ప్రజలకు ఉరుకులు పరుగులు తప్పడం లేదు.

**అత్యవసర వైద్యం అందడం లేదు**

కడ్తాల్ మండల కేంద్రం మీదుగా శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి ఉండటంతో తరుచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. బాధితులకు ఆస్పత్రికి తరలించడానికి 108 వాహనం కోసం అరగంట పాటు వేచి చూడాల్సిందే. వాహనం రావడం ఏమాత్రం ఆలస్యమైనా బాధితుల ప్రాణాలు గాల్లో కలిసినట్లే. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనాల్లో గ్రామంలోని ప్రైవేటు వైద్య కేంద్రాలకు తీసుకుని వస్తున్నా.. సత్వర వైద్యం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు.

**సిబ్బంది కొరతతో ఇబ్బంది**

2017లో మైసిగండిలో ప్రారంభించిన పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను నియమించాల్సి ఉంది. అయితే ఒక్కరు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఒక ఫార్మాసిస్ట్ ఉండగా అతను కూడా డిప్యూటేషన్‌పై వెళ్లారు. మరొకరు అమనగల్లు ఆసుపత్రి నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. సూపర్‌వైజర్, ఎంపీహెచ్‌ఈవో ఉండగా, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. స్టాఫ్ నర్స్ పోస్టులు నాలుగు ఖాళీగా ఉన్నాయి. ల్యాబ్ టెక్నీషియన్ పోస్ట్ ఖాళీగానే ఉంది. సిబ్బంది కొరతతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మైసిగండి పీహెచ్‌సీలో పూర్తి స్థాయిల్లో సిబ్బందిని నియమించడంతో పాటు వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

**వైద్య సిబ్బంది నియమించాలి**



మైసిగండిలో పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉంది. దీంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలందడం లేదు. రోగం వచ్చిన నొప్పి వచ్చిన పట్నం పోవాల్సి వస్తుంది. మైసిగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించి, ప్రజలకు 24 గంటలు వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలి.

– క్యామ రాజేశ్, యువజన నాయకులు, కడ్తాల్

**అందుబాటులో ఉంచాలి**



కడ్తాల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఏర్పాటుతో పాటు 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలి. ప్రమాదం జరిగినా.. ఇతర ఆరోగ్య సమస్యల వచ్చినా.. సకాలంలో బాధితుడిని ఆస్పత్రికి తరలించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

– బాల్‌రాజ్, మక్తమాధారం గ్రామం, కడ్తాల్ మండలం

**ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం**



మండలంలో నిరుపేద కుటుంబాలు చాలా ఉన్నాయి. పేదలకు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొనే స్థోమత లేదు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం. ఎమ్మెల్యే సహకారంతో మండల కేంద్రంలో ఆస్పత్రి నిర్మించేందుకు కృషి చేస్తున్నాం.

– గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, కడ్తాల్

## కసిరెడ్డికి వినతి

**ఆమనగల్లు:** మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామంలోని చెరువులను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని గిరికొత్తపల్లి రైతు సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. శుక్రవారం నారాయణరెడ్డికి రైతు సంక్షేమసంఘం అధ్యక్షుడు శ్రీను, సభ్యులు శంకరయ్య, మధుసూదన్ రెడ్డి, రాములు, యాదగిరిరెడ్డి వినతిపత్రం అందజేశారు. గిరికొత్తపల్లి గ్రామంలోని రంగసముద్రం, చాకలికుంట, తుమ్మలకుంట చెరువులను ధ్వంసం చేశారని, వాటిని పునరుద్ధరించి గిరికొత్తపల్లి గ్రామానికి సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు. అంతేకాకుండా ఆమనగల్లు పట్టణానికి చెందిన హౌస్ పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేశ్, కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కేఎన్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలు



వరినాట్ల గురించి విద్యార్థులకు వివరిస్తున్న శ్రీనివాస్‌రావు

**ఇబ్రహీంపట్నం రూరల్:** విద్యార్థులే భవిష్యత్తు నిర్మాతలని శ్రీనివాస టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల పట్ల అవగాహన అవసరమని అభిప్రాయపడ్డారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లోని శ్రీనివాస టాలెంట్ స్కూల్ ప్రీప్రైమరీ విద్యార్థులను మట్టితో కుండలు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనార్థాలను వివరించారు. విద్యార్థులకు వరి పండించే విధానాన్ని పొలంలోకి తీసుకెళ్లి చూపించారు. విద్యార్థులు వ్యవసాయ రంగంలో మెలుకువలు తెలుసుకోవాలని సూచించారు.

## ప్రజాసేవకు విరమణ లేదు

**ఆమనగల్లు:** ప్రజాప్రతినిధులకు విరమణ పదవులకే తప్పా ప్రజాసేవకు కాదని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు రవీందర్ నాయక్ అన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా గ్రామ పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం పదవీకాలం పూర్తయిన సర్పంచ్ అమర్‌సింగ్, ఉపసర్పంచ్ మల్లేశ్, వార్డు సభ్యులను రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమన్నారు. గ్రామ సర్పంచ్‌గా అమర్‌సింగ్ గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌నాయక్, పరమేశ్వర్, పాండునాయక్, తావుర్యానాయక్, రాములునాయక్, కృష్ణ, పురుషోత్తం, శ్రీను, మణిపాల్, రఘునాయక్, రవీందర్, నవీన్, రమేశ్ పాల్గొన్నారు.

**సర్పంచ్‌ల సేవలు అభినందనీయం**

**కడ్తాల్:** గ్రామాల్లో సర్పంచ్‌లు అందించిన సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కొనియాడారు. పదవీ కాలం పూర్తి చేసుకున్న కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో జైపాల్‌యాదవ్‌ను కలిశారు.

# పల్లెల్లో ప్రత్యేక పాలన షురూ

● బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు



బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ రామకృష్ణ

**ఆమనగల్లు:** ఆమనగల్లు మండలంలోని వివిధ గ్రామ పంచాయితీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. గ్రామ సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో వారి స్థానంలో అన్ని గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆమనగల్లు మండలంలోని 13 గ్రామ పంచాయితీలకు గాను ఏడుగురిని ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఆకుతోటపల్లి, సీతారాంనగర్‌తాండా గ్రామాలకు ఫారుక్‌హుస్సేన్ (ఎంపీడీఓ), మంగళపల్లి, చింతలపల్లి గ్రామాలకు లలిత (తహసీల్దార్), మేడిగడ్డ, శంకర్‌కొండతాండాలకు శ్రీలత (ఎంపీఓ), రాంనుంతల, కోనాపూర్‌లకు అరుణకుమారి (వ్యవసాయాధికారి), పోలెపల్లి, కొత్తకుంటతాండాలకు తిరుపతయ్య (ఏఈ, ఇరిగేషన్), సింగంపల్లి, చెన్నంపల్లిలకు కృష్ణయ్య (ఏఈ, పీఆర్), శెట్టిపల్లికి శరత్(ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్)ను నియమించారు.

**మాడ్గులలో..**

మాడ్గుల మండంలోని మాడ్గుల, కొల్కులపల్లి, అప్పారెడ్డిపల్లి గ్రామాలకు ప్రత్యేకాదికారిగా రాఘవులు(ఎంపీడీఓ), ఇర్విన్, గిరికొత్తపల్లి, రాందుగ్యాలకు నిరంజన్‌రావ్(తహసీల్దార్), నాగిళ్ళ, కాట్రగానితాండా, ఫిరోజ్‌నగర్, గుడితాండాలకు వేజన్న(ఎంపీఓ), బ్రాహ్మణపల్లి, నల్లచెరువు, కాశీగూడెంలకు గౌతమ్‌కుమార్(వ్యవసాయాధికారి), అవురుపల్లి, నల్లవారిపల్లి, దొడ్లపహాడ్‌లకు సర్దార్‌నాయక్(ఎంఈఓ), అందుగుల, పల్లెతాండా, అంతంపేటలకు రాజేశేఖర్(డిప్యూటి తహసీల్దార్), నర్సాయిపల్లి, పకీరాతాండా, జయరాంతాండాలకు సోమశేఖర్(పశువైద్యాధికారి), ఆర్కపల్లి, సుద్దపల్లి,పలుగుతాండాలకు సూర్య వంశీ(ఏఈపీఆర్), కలకొండ, చంద్రాయణపల్లి, సంద్రలగడ్డతాండాలకు శ్రీనివాస్(ఏఈఆర్ డబ్ల్యూఎస్), కుబ్యతాండా, నర్సంపల్లి, జర్పుల తాండాలకు సాయిదీరజ్(ఏఈ, మిషన్‌భగీరథ), అన్నోబోయినపల్లి, కొత్తబ్రాహ్మణపల్లికి చంద్రకాంత్ (ఏఈ)ను నియమించారు.

**గ్రామ ప్రత్యేకాధికారులు వీరే**

**కడ్తాల్:** గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన శుక్రవారం నుంచి ప్రారంభమైంది. మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీలకు 14 మందిని నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. గ్రామాల వారీగా ప్రత్యేకాధికారుల వివరాలు.. కడ్తాల్– రామకృష్ణ ( ఎంపీడీఓ), ముంతాజ్– ముద్వీన్ ( తహసీల్దార్), మధుసూధనచారి– రావిచేడ్ ( ఎంపీవో), శ్రీలత– మైసిగండి ( ఎంఏఓ), సందీప్‌కుమార్– అన్మాస్‌పల్లి, గానుగుమార్లతండా ( డిప్యూటీ ఈఈ మిషన్‌భగీరథ), డాక్టర్ భానునాయక్– గడ్డమీదితండా, పీవీ తండా (వెటర్నరీ డాక్టర్), పరమేశ్– కర్కల్‌పహాడ్, నార్లకుంట (ఏఈ, పంచాయతీరాజ్), సక్కుబాయి– గోవిందాయిపల్లి, గోవిందాయిపల్లితండా ( సీడీపీఓ), నిఖిల– చరికొండ, పల్లెచెలకతండా (ఏఈ– మైనర్ ఇరిగేషన్), రవితేజ– వాస్‌దేవ్‌పూర్, బాలాజీనగర్ (ఏఈ– ఆర్‌అండ్‌బీ), శ్రావ్య– ఎక్వాయిపల్లి, మద్రిపల్లి ( ఏఈ– మిషన్‌భగీరథ), వినోద్‌కుమార్–సాలార్‌పూర్, చల్లంపల్లి (నాయబ్ తహసీల్దార్), సురేశ్‌నాయక్– మక్తమాధారం, రేఖ్యతండా (ఏఈ, మిషన్ భగీరథ), శ్రీనివాస్–న్యామతాపూర్, కొండ్రిగానిబోడ్‌తండా (డిప్యూటీ ఈఈ, పంచాయతీరాజ్) నియమితులయ్యారు.

# సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే

● పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

**ఇబ్రహీంపట్నం:** పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం పీఆర్టీయూ మండల శాఖను ఎన్నుకున్నారు. సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. ఎన్నో నెలలుగా పెండింగ్ ఉన్న మెడికల్, సరెండర్ బిల్లులు, జీపీఎఫ్ రుణాలు, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు ప్రతినెల చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

**నూతన కమిటీ ఎన్నిక:** పీఆర్టీయూ తెలంగాణ ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షుడిగా పట్నం కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు ఎన్నికైనట్లు రాజిరెడ్డి తెలిపారు. నూతన కమిటీ ఉపాధ్యాయుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ జిల్లా శాఖ జిల్లా దృష్టికి తీసుకురావాలని కోరారు.

# అవినీతి సొమ్ము రికవరీ చేయాలి

కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

**మంచాల:** మంచాల పీఏసీయస్ కార్యాలయంలో జరిగిన అవినీతిపై విచారణ చేసి సొమ్మును రికవరీ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మంచాల మండల కార్యాలయంలో మంచాల పీఏసీయస్ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాన్యం కొనుగోలు విషయంలో కూడా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతిపై డైరెక్టర్లు పోరాటం చేయడంతో చైర్మన్ పుల్లారెడ్డిని తొలగించారని తెలిపారు. ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీయస్ డైరెక్టర్లు రాంరెడ్డి, హన్మంత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రమేశ్, వెంకటేశ్, వేణుగోపాల్‌రావు, మణెమ్మ, అరుణమ్మ, ప్రజా ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

**తుర్కయంజాల్:** జాయింట్ ఫ్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 16న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కార్మిక శాఖ అధికారి ప్రమోద్‌కు శుక్రవారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు దశల వారీగా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపు నిధులను తగ్గించడంతో పాటు, పనిదినాలను తగ్గించి నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేటీకరణ పేరుతో దేశ ప్రజలను నిలువు దొపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కేంద్ర ప్రభుత్వం విఫలం**

**ఇబ్రహీంపట్నం రూరల్:** కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆదిబట్ల మున్సిపాలిటీ సీఐటీయూ కన్వీనర్ నర్సింహ విమర్శించారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మెను గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

# కల్యాణ్‌నాయక్‌కు సన్మానం



కల్యాణ్‌నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

**కడ్తాల్:** గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా కల్వకుర్తి ప్రాంతానికి చెందిన కల్యాణ్‌నాయక్‌ను బీజేపీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు శుక్రవారం కడ్తాల్ మండల బీజేపీ నాయకులు హైదరాబాద్‌లో కల్యాణ్‌నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలాల్‌నాయక్, రెడ్యానాయక్, ప్రేమ్‌కుమార్, సూర్యనాయక్, దశరథ్‌నాయక్, సంజీవ్, బీజేపీ పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## 'ఉపాధిహామీ'తో వలసలు నివారించవచ్చు



కేక్ కట్ చేస్తున్న డీఆర్‌డీఓ ప్రభాకర్

● డీఆర్‌డీఓ ప్రభాకర్

**ఇబ్రహీంపట్నం:** జాతీయ ఉపాధి హామీ పథకంతో వలసలను నివారించవచ్చని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖాధికారి ప్రభాకర్ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పార్లమెంట్‌లో ఆమోదం పొంది చట్టంగా రూపొందించుకున్న నేపథ్యంలో శుక్రవారం రాయపోల్ గ్రామంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ఫిబ్రవరి 2, 2005లో వచ్చిందన్నారు. ఈ చట్టంతో కూలీలు పనికొరే హక్కు పొందారన్నారు. ఈ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీడీ సక్రియానాయక్, ఏపీఓ తిరుపతిచారి, రవికుమార్ పాల్గొన్నారు.

## ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

**కడ్తాల్:** కడ్తాల్ ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ శుక్రవారం సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఐ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రభు, కృష్ణ, మోహన్, లక్ష్మణ్, జగన్, ఏఎస్‌ఐ ప్రసాద్ ఉన్నారు.

**నూతన ఎస్‌ఐగా వరప్రసాద్**

ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ బదిలీపై సంగారెడ్డి జిల్లాకు వెళ్లడంతో నూతన ఎస్‌ఐగా కేశంపేట నుంచి బదిలీపై వచ్చిన బీఎస్ఎస్ వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ వరప్రసాద్‌కి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

ఎస్‌ఐ మైబెల్లి




మాట్లాడుతున్న ఎస్‌ఐ మైబెల్లి

**ఇబ్రహీంపట్నం:** సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, టెక్నాలజీని వాడుకొని నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, వీరి వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ మైబెల్లి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ ఆప్‌గ్రేడ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 'బాయిస్ ఫర్ ఛేంజ్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే దశ నుంచే చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, వారిని వేధించిన చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బహ్మచారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.